క్లుప్తంగా

భగవద్గీతతో జ్ఞానం



సూర్యనారాయణను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఉపనిష్మందిరం ఆధ్వర్యంలో గీతాజయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం 'జ్ఞాన విజ్ఞాన యోగం' అనే అంశంపై దూసి సూర్యనారాయణ ప్రసంగించారు. భగవద్గీత ద్వారా మనలో జ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం సూర్యనారాయణను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ స్వామి, రంగడు ప్రసాదరావు, మొదలవలస రమణ, ఉమారాణి, జగదాంబ, చంద్రరావు, మల్లేశ్వరరావు, కామేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని న్యూకాలనీ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో విశ్రాంత స్టేట్‌బ్యాంకు ఉద్యోగి వైశ్యరాజు శశిభూషణరాజు శుక్రవారం 27 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవానీస్వాముల సైకిల్ యాత్ర



విజయవాడ బయలుదేరిన స్వాములు

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి నుంచి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం భవానీస్వాములు శుక్రవారం సైకిల్ యాత్ర ప్రారంభించారు. భవానీమాల ధరించిన అసిరినాయుడు, వెంకటరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, రాములు సైకిల్‌పై దేవీ దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

ఎన్ఎస్ఎస్ బృందానికి అభినందనలు



అధికారులతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పశ్చిమబెంగాల్ రాష్ట్రం రాణిగంజ్‌లో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు ఎంపికైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బృందాన్ని వర్సిటీ అధికారులు శుక్రవారం అభినందించారు. క్యాంపస్‌కు చెందిన యమున, కల్యాణ్, ఝూన్సీ, దేవిక, రమేష్, శ్రీకాకుళం కాకినాడ ఆదిత్య కళాశాలలకు చెందిన షణ్ముఖ, కౌశిక, లోలాక్షి శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి సిబ్బంది

ఎచ్చెర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై జరిపే సామాజిక తనిఖీలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జీపీఎస్ స్టేట్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం అజ్జరాం, కుప్పిలి, ఇబ్రహింబాద్ గ్రామాల్లో సామాజిక తనిఖీలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎటువంటి అవకతవకలు జరిగినా వాటిని తనిఖీ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రాధ, ఎస్ఆర్‌పీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో వాగ్వాదం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్(సర్వజన ఆసుపత్రి)లో రిమ్స్ సూపరింటెండెంట్, కొందరు వైద్యులు, ఉద్యోగులు శుక్రవారం క్రిస్మస్ వేడుకలను ఆస్పత్రి ఆవరణలో నిర్వహించడం వివాదాస్పదమైంది. విద్యుత్ సరఫరా నిలిచిపోగా, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని రోగులు అధికారులకు తెలిపేందుకు వెళ్లగా.. ముగ్గురు ఆర్ఎంవోలు సెలవులో ఉండటంతో సూపరింటెండెంట్‌కు చెప్పేందుకు వెళ్లారు. ఆమె ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఉన్నట్లు తెలుసుకుని.. భజరంగదల్, ఏబీవీపీ కార్యకర్తలకు విషయాన్ని తెలియజేశారు. వారు రిమ్స్ మూడో అంతస్తులో జరుగుతున్న వేడుకల వద్దకు వచ్చి వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కొందరు ఉద్యోగులు విషయాన్ని రెండో పట్టణ పోలీసులకు చేరవేశారు. సీఐ, ఎస్ఐలు సిబ్బందితో రిమ్స్‌కు చేరుకుని ఇరువర్గాలను శాంతింపచేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం నచ్చజెప్పి పంపించేశారు.

పింఛన్ ఉంచేనా?

- అనర్హత గుర్తింపు పేరిట సర్వే చేస్తున్న అధికారులు
- పైలెట్ ప్రాజెక్టుగా సంతసీతారాంపురం ఎంపిక
- ఇప్పటికే వివరాలు సేకరించిన సిబ్బంది
- కూటమి ప్రభుత్వంలో కానరాని కొత్త పింఛన్లు



ఇటీవల సంతసీతారాంపురంలో పింఛన్‌దారుల వివరాలు సేకరించిన సిబ్బంది

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పింఛన్లు	
మండలం	అన్నిరకాల పింఛన్లు
ఎచ్చెర్ల	12,533
రణస్థలం	11,166
లావేరు	10,912
జి.సిగడాం	8757

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా కొత్త పింఛన్ల ఊసే లేదు. దీనికితోడు ఉన్న పింఛన్లలో అనర్హత పేరిట తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు బీసీలకు 50 ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తామన్నారు. వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. గత ప్రభుత్వంలో ఇస్తున్న పింఛన్లు మాత్రమే కొనసాగుతున్నాయి. మరోవైపు మృతి చెందిన వృద్ధులకు సంబంధించి పింఛన్లు నిలిచిపోతున్నాయి. వాటిని కొత్తవారికి ఇవ్వకపోగా తొలగింపునకు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొలగింపే లక్ష్యం..

ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనర్హుల పింఛన్లు తొలగించాలని సూచించారు. వెంటనే సర్వేలు చేయాలని సూచించారు. దీనిలో భాగంగా పింఛన్ల అర్హత సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురం(ఎస్ఎస్ఆర్‌పురం) పంచాయతీని ఎంపిక చేశారు. ఈ నెల 2, 3వ తేదీల్లో సర్వే నిర్వహించారు. ఎస్ఎస్ఆర్‌పురం పంచాయతీ పరిధిలో సంతసీతారాంపురం, బలిజిపేట, చినరావుపల్లి, నందిగాం గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 425 మందికి పింఛన్లు ఇస్తున్నారు. వీరిలో అందుబాటులో ఉన్న 407 మంది పింఛన్ల అర్హత పరిశీలించారు. 18 మంది అందుబాటులో లేరు. లావేరు, రణస్థలంకు చెందిన సచివాలయ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు. 17 మంది అనర్హులను గుర్తించారు. ఎక్కువగా దివ్యాంగ పింఛన్లు లక్ష్యంగా ఈ తనిఖీ జరుగుతోంది. అప్పట్లో సదరం ధ్రువీకరణ ఆధారంగా పింఛన్లు ఇచ్చారు. మళ్లీ వీరిని సదరం విభాగానికి పంపించి దివ్యాంగ శాతం ధ్రువీకరించటం, 40 శాతంలోపు ధ్రువీకరణ ఉంటే తొలగించేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం పింఛన్లు తొలగిస్తారన్న అంశం గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. సర్వేలో భాగంగా పింఛన్ ఎప్పటి నుంచి వస్తుంది, కుటుంబ నేపథ్యం, ఆర్థిక నేపథ్యం.. ఇలా అన్ని అంశాలపైనా ఆరా తీస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించే గతంలో పింఛన్లు మంజూరు చేయగా, మళ్లీ అర్హత పరిశీలన ఎందుకని లబ్ధిదారులు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

మళ్లీ ఎందుకు?



అప్పట్లో పింఛన్ దరఖాస్తులను, అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాకే పింఛన్లు మంజూరు చేశారు. మళ్లీ ఇప్పుడు సర్వే పేరుతో తొలగించాలని చూడటం సరికాదు. దివ్యాంగులకు పింఛనే ఆధారం. అటువంటి వారిని ఇబ్బందులకు గురి చేయడం తగదు.

– గవిరెడ్డి రవికుమార్, బలిజిపేట

కొత్త పింఛన్లు ఇవ్వాలి..



కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. చాలా మంది అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా ఉన్న పింఛన్లు తొలగింపు మంచి పద్ధతికాదు.

– దుంప చిన్నారెడ్డి, సంతసీతారాంపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ ఆదేశాల మేరకే సర్వే చేస్తున్నాం. పింఛన్లు తొలగించేందుకు కాదు. సర్వే అన్నది పక్క మండలాల సిబ్బంది చేస్తున్నారు. ఉన్నతాధికారులఆదేశాలు మేరకు సంతసీతారాంపురంలో ముందుగా సర్వే నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం.

– సీపాన హరిహరరావు, ఎంపీడీఓ, ఎచ్చెర్ల

రక్తదానానికి ముందుకురండి



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రణస్థలం: జిల్లాలో రక్తపు నిల్వల కొరతను అధిగమించడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని ఏపిటోరియా ఫార్మా హెచ్ఆర్ హెడ్ కె.కమలాకర్ రెడ్డి, పి.నారాయణరావు పిలుపునిచ్చారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పైడిభీమవరం ఏపిటోరియా ఫార్మా పరిశ్రమలో ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులు 178 యూనిట్ల రక్తదానం చేసి ఎన్టీఆర్ ట్రస్ట్, రోటరీ క్లబ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్, రోటరీ క్లబ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు కె.సోమశేఖర్, త్రిశాంక్, ఎన్.ప్రసాద్‌లు, ఫార్మా మెడికల్ డాక్టర్ బురహన్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకు గిట్టుబాటు ధర కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న పాడి రైతులు

రణస్థలం: విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు సేకరణ ధర వెంటనే పెంచాలని, పాలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, రైతు సంఘం నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. రణస్థలం మండలం ముక్తుంపురంలో ఏపీ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు నిరసన వ్యక్తం చేశారు. తగ్గించిన ఆవు పాలు ధర పెంచాలని కోరుతూ డిసెంబర్ 16న శ్రీకాకుళంలో జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జరిగే పాల రైతుల సదస్సు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.అప్పలనాయుడు, కె.సన్యాసప్పలనాయుడు, సీహెచ్ పాపయ్య, టి.పైడిరాజు, సూరమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర పంటలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఆరోగ్యకర పంటలపై రైతుల్లో అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో శుక్రవారం రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యం, పోషణ పంటల సాగుపై ఆరోగ్య ఉపకమిటీ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిచెన్ గార్డెన్ల సాగుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం కిచెన్ గార్డెన్లు సాగు చేస్తున్నట్లు వివరించారు. 360 రోజులూ ఆదాయం వచ్చే పంటలు, డ్రై సోయింగ్ సాగు వంటివి కీలకమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం, బీజామృతం, కషాయాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు శోభ, సత్య తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు విశేష అలంకరణ



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో మార్గశిర శుక్రవారం సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, మహన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. - శ్రీకాకుళం కల్చరల్

అమ్మవారికి అభిషేకం



ఎచ్చెర్ల మండలం కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. శ్రీచక్రాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - ఎచ్చెర్ల

అంతర పంటల సాగుపై ఆసక్తి



వర్షాధార ప్రాంతాల రైతులు అంతరపంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. కుప్పిలి, అజ్జరాం, ఎచ్చెర్ల వంటి గ్రామాల్లో కొబ్బరి, అరటి, మిరప, బెండ తదితర పంటలను ఒకే చోట సాగు వేస్తు న్నారు. తక్కువ పెట్టుబడి, సాగునీటితో వివిధ రకాల పంటలు చేతికి అందివస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఒక పంటపోయినా మరోపంట బాగా పండటంతో నష్టపోవాల్సిన అవసరం ఉండదని అంటున్నారు. - ఎచ్చెర్ల

పంచలోహ విగ్రహ ప్రతిష్ట



లావేరు మండలం మురపాక గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో పంచలోహ ఆంజనేయస్వామి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. అర్చకులు రమణశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. - ఎచ్చెర్ల

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతాలు



సామూహిక పూజలు చేస్తున్న భక్తులు



గుడివీధిలో అభయాంజనేయుడికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో మార్గశిర శుద్ధ త్రయోదశి పురస్కరించుకొని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమత్ వ్రతాలు, హోమాలు, సింధూరార్చనలు, తమలపాకు అర్చనలు వైభవంగా నిర్వహించారు. గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అర్చకులు పెంట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో భక్తులతో పాలాభిషేకాలు చేయించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

- పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న పంచముఖాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అనంతరం సహస్ర తమలపాకులతో అర్చనలు, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎల్.నందికేశ్వరరావు, రామలింగస్వామి పాల్గొన్నారు.
- నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలోని అభయాంజనేయుని సన్నిధిలో హనుమత్ వ్రతాలు, తమలపాకుల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.
- గుజరాతిపేటలోని జగన్నాథస్వామి దేవాలయంలో శక్తిపథ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట సత్యనారాయణ శర్మ సోదరులు ఆధ్వర్యంలో అభిషేకాలు, తమలపాకులతో అర్చనలు చేశారు. గారెలు నైవేద్యంగా సమర్పించారు.
- పాలకొండ రోడ్డులోని కోట ఆంజనేయస్వామి ఆలయంలో సామూహిక హనుమత్ వ్రతాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం.గిరీశం శర్మ, అర్చకులు పార్థసారధిశర్మల ఆధ్వర్యంలో తమలపాకుల పూజలు చేశారు. పిదప ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి వ్రతాలు ఆచరించారు. పుణ్యపు వీధి అభయాంజనేయ స్వామికి ఆలయ ధర్మకర్త కొండబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



పాతశ్రీకాకుళంలో పంచముఖ ఆంజనేయస్వామి



గుజరాతిపేటలో శక్తిపథ ఆంజనేయస్వామికి అలంకరణ

స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ ఆవిష్కరణకు వర్సిటీ బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: విజయవాడలో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర డాక్యుమెంట్ ఆవిష్కరణకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ బృందం శుక్రవారం హాజరైంది. ప్రత్యేక ఆహ్వానితురాలుగా వీసీ రజిని హాజరు కాగా, వర్సిటీ అధ్యాపకులు కూడా పాల్గొన్నారు.

విజయదుర్గకు విశేష అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా దేవి ఆలయంలో మార్గశిర శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద ఉచిత నిత్యాన్నదాన పథకం నిరంతరం కొనసాగుతుందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. బొట్టా సాయికుమార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అన్నదానానికి తనవంతు సాయం చేశారు. కార్యక్రమంలో నంది ఉమాశంకర్, పాడుగు చరణ్, జాడ సాయి, ఉర్లం శివతేజ, జి.పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. బెహరా మనోవికాస కేంద్రంలో భైరి వరప్రసాదరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమారుడు శ్యామ్‌కుమార్, కుటుంబ సభ్యులు అల్పాహార వితరణ చేశారు.

ఎన్నాళ్లీ వెతలు?



కల్వర్టుపై పలకలు లేని దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని రైతుబజార్ సమీపంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టి సుమారు నెల రోజులు కావస్తున్నా నేటికీ కాలువలపై పలకలు, అప్రోచ్‌రోడ్డు వేయకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మొదట్లో రోడ్డు వేసేందుకు తవ్వకాలు జరిపి సుమారు మూడు నెలల పాటు వదిలేశారు. తర్వాత రోడ్డు నిర్మించి కల్వర్టుపై పలకలు వెయ్యకపోవడంతో రాకపోకలకు స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డులో రెండు ఆస్పత్రులు, ఎంపీడీఓ కార్యాలయం ఉండటంతో నిత్యం రద్దీ ఉంటుంది. చిన్నారులు, వృద్ధులు కాలువ దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు చొరవచూపి ఈ కష్టాల నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.



రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వృద్ధులు

కృపాసముద్రం మృతి తీరని లోటు



శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన దైవశక్తి వ్యవస్థాపకులు జె.కృపాసముద్రం శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె జిల్లాలో 12 చర్చిలను స్థాపించి వాడవాడలా క్రీస్తుసందేశాన్ని వినిపించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని వందల ప్రసంగాలు చేసి అనేక సత్కారాలు పొందారు. టి.వి.రేడియోలలో క్రీస్తు సందేశాలను అందించారు. ఈమె మరణం తీరని లోటని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

జ్ఞానరాజు మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని పురాతన తెలుగు బాప్టిస్టు చర్చిలో 35 ఏళ్లగా సేవలందిస్తున్న కోటిపల్లి జ్ఞానరాజు మృతిచెందారు. ఈయన మృతి పట్ల చర్చి కార్యవర్గ సభ్యులు, సంఘ విశ్వాసులు, కాపరులు, పెద్దలు శుక్రవారం సంతాపం తెలిపారు.

16, 17 తేదీల్లో సుస్థిర ప్రగతి, అభివృద్ధిపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు ఈ నెల 16, 17 తేదీల్లో సుస్థిర ప్రగతి, అభివృద్ధి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీఎస్ రామ్మోహన్ శుక్రవారం చెప్పారు. పంచాయతీ వనరుల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులంతా పాల్గొనాలని కోరారు.

